

మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డితో బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నాయకులు

## కాంగ్రెస్ పాలనలో బాధపడుతున్న జనం

- మళ్లీ కేసీఆరే రావాలని కోరుకుంటున్నరు
- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డిని కలిసిన బీఆర్‌ఎస్ నాయకులు

యాదగిరిగుట్ట, ఏప్రిల్2 : మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డిని బీఆర్‌ఎస్ పార్టీ ఆలేరు నియోజకవర్గ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి స్వామివారి ప్రసాదాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పాలనలో ఆలేరు నియోజకవర్గంలో నెలకొన్న సమస్యలను జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. సాగునీళ్లు లేక పంటలు పూర్తిగా ఎండిపోయాయని, మిషన్ భగీరథ పథకాన్ని నిర్లక్ష్యం చేసి తాగునీళ్లు లేకుండా చేశారని చెప్పారు. యాదగిరి గుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయాన్ని మాజీ సీఎం కేసీఆర్ ఎంతో అద్భుతంగా పునర్నిర్మించారని, కానీ ప్రస్తుత ప్రభుత్వంలో కనీస వసతులు కల్పించకపోగా స్వామి వారి ఆదాయాన్ని ఇతర అవసరాలకు తరలిస్తున్నారని తెలిపారు. గుట్టలో 10 శాతం పెండింగ్ పనులు కూడా పూర్తి చేయలేకపోతున్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ఓటేసి చాలా తప్పు చేశామని ప్రజలు బాధపడుతున్నారని, కేసీఆర్ వస్తేనే మళ్లీ మంచిరోజులు వస్తాయని వివరించారు. జగదీశ్‌రెడ్డిని కలిసిన వారిలో బీఆర్‌ఎస్ యాదగిరిగుట్ట మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, నార్మూల్ మాజీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి, ఆలేరు మున్సిపాలిటీ మాజీ చైర్మన్ వస్పరి శంకరయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, వైస్ చైర్మన్ గ్యాదపాక నాగరాజు, బీఆర్‌ఎస్ పట్టణ సెక్రటరీ జనరల్ పాపట్ల నరహరి, నాయకులు మిట్ట వెంకటయ్య, గుండ్లపల్లి వెంకటేశ్‌గౌడ్, ఆవుల సాయి, శారాజీ రాజేశ్ యాదవ్ తదితరులు ఉన్నారు.

## తాడువాయి పీఏసీఎస్‌లో ముగ్గురు ఉద్యోగుల సస్పెన్షన్



తాడువాయి పీఏసీఎస్

సూర్యాపేట/మునగాల, ఏప్రిల్ 2 : మునగాల మండలం తాడువాయి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవకతవకలకు పాల్పడిన ముగ్గురు ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ జిల్లా సహకార అధికారి పద్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో అవకతవకలు జరిగాయని ఫిర్యాదు రావడంతో విచారణ చేపట్టగా ప్రాథమిక నివేదికను అనుసరించి బాధ్యులైన కార్యదర్శి రాచకొండ నాగేందర్, స్టాఫ్ అసిస్టెంట్ పనస కోటయ్య, కంప్యూటర్ ఆపరేటర్ పర్వీన్‌ను సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు. సెక్షన్ 51 కింద వారిని విచారణకు ఆదేశాలు జారీ చేశామని, పూర్తి విచారణ అనంతరం వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# చివరి పోరాటం

## ఆఖరి తడులకు తండ్లాడుతున్న రైతులు

**యాసంగి సీజన్‌లో తుంగతుర్తి నియోజకవర్గంలో 70శాతం పంటలు నష్టపోయిన రైతాంగం మిగిలిన కొద్దిపాటి పొలాలైనా కాపాడుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నది. ఇప్పటికే వేల ఎకరాలు పశువులు, గొర్రెలకు మేతగా మారిన సంగతి తెలిసిందే. మిగిలిన పంటలు పొట్టదశలో ఉండగా ఒక్క తడి నీళ్ల కోసం రైతులు తండ్లాడున్నారు. వారంపాటు నీళ్లు అందిందే వరి పైర్లు చేతికి వచ్చే అవకాశం ఉన్నా ప్రభుత్వం నీటి విడుదల బంద్ పెట్టడం, బోర్లు సరిగ్గా పోయకపోవడంతో చివరి దశలో పంటలను కాపాడుకునేందుకు శతివిధాలా ప్రయత్నిస్తున్నారు. ఎస్సారెస్పీ కాల్వలకు వారబందీలో ఆరు విడుతల నీళ్లు ఇస్తామన్న ప్రభుత్వం షెడ్యూల్ పూర్తయ్యిందంటూ మార్చి 24తో నీటి విడుదలను బంద్ చేసింది. వాస్తవానికి మొదటి నుంచి కూడా ఎన్నడూ పూర్తిస్థాయిలో రైతులకు నీళ్లు అందడం లేదు. ప్రధాన కాల్వల్లోనూ పిల్ల కాల్వల కంటే దారుణంగా నీళ్లు పారాయి. ఇప్పుడు మొత్తానికే బంద్ పెట్టడంతో పొట్టదశలో ఉన్న పంటలు ప్రశ్నార్థకంగా మారాయి. సాగు నీరు లేకపోవడం, చెరువులు నింపకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి బోర్లు వట్టిపోయిన సంగతి తెలిసిందే. ఎక్కడైనా కొద్దోగొప్పో నీళ్లు ఉన్నా ఆగిఆగి పోస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో పంటలను కాపాడుకునేందుకు పలుచోట్ల రైతులు ట్యాంకర్లతో నీళ్లు కొనుగోలు చేసి తడులు అందిస్తున్నారు.**

– తిరుమలగిరి, ఏప్రిల్ 2

### అడుగంటిన భూగర్భ జలాలతో వట్టిపోయిన బోర్లు

- తుంగుతుర్తి నియోజకవర్గంలో 70 శాతం ఎండిన వరి
- యాసంగిలో సాగు చేసింది 54,721 ఎకరాలు
- ప్రభుత్వం పరిహారం చెల్లించాలని రైతుల వేడుకోలు



తిరుమలగిరిలో భూగర్భజలాలు అడుగంటడంతో ధారగా పోస్తున్న రైతు కొమరమల్లుకు చెందిన బోరు

బీఆర్‌ఎస్ సర్కారులో వచ్చినట్టే సాగు నీరు అందుతుందని భావించిన రైతులు యాసంగిలో తుంగతుర్తి నియోజకవర్గవ్యాప్తంగా 54,721 ఎకరాల్లో వరి సాగు చేశారు. తిరుమలగిరి మండలంలో 3,360 ఎకరాలు, నాగారంలో 8 వేలు, జాజిరెడ్డిగూడెంలో 16 వేలు, తుంగతుర్తిలో 14,208, నూతనకల్‌లో 4,500, మద్దిరాల మండలంలో 8,653 ఎకరాల్లో వరి పెట్టారు. కాగా, సాగు నీరు అందక ఇప్పటికే 70 శాతం పంటలు ఎండిపోయాయి. ఫిబ్రవరిలో ఆలస్యంగా నాటు వేసిన పొలాలు ప్రస్తుతం పొట్టదశలో ఉన్నాయి. ప్రభుత్వం ఒక్క తడికి నీళ్లు ఇచ్చినా ఎంతోకొంత పంట చేతికి వస్తుందని రైతులు వేడుకుంటున్నారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటి వరకు కూడా తుంగతుర్తి నియోజకవర్గంలో దుర్భర పరిస్థితులు ఉండేవి. ఎటు చూసినా బీడు భూములు. నెర్రెలు బారిన చెరువులు, కుంటలే. 300 వందల ఫీట్ల బోర్లు తవ్వినా నీటి జాడ దొరికేది కాదు. అప్పులు, పస్తులు, రైతు ఆత్మహత్యలు, వడ్డీ వ్యాపారుల వేధింపులు ఉండేవి. వలస బాటలో గ్రామాలకు గ్రామాలు ఖాళీ అయ్యేవి. కేసీఆర్ ముఖ్యమంత్రిగా పరిస్థితులను చక్కదిద్ది ఏడాదిలో రెండు పంటలకు కాళేశ్వరం జలాలు ఇచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పుష్కలంగా సాగునీరు ఇవ్వడంతోపాటు చెరువులు నింపడంతో భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయి. 30 ఫీట్లు బోరు తవ్విస్తే నీళ్లు ఉబికి వచ్చేవి. దానికి రైతుబంధు, 24గంటల నిరంతర విద్యుత్ ఇవ్వడంతో రైతులు పుష్కలంగా పంటలు పండించి ఆర్థికంగా కొంత నిలదొక్కుకున్నారు. వలసలు వెళ్లిన వారు సైతం వాపస్ వచ్చి ఉన్నభూమిని బాగు చేసుకుని పంటలు పండించుకున్నారు. మళ్లీ ఇప్పుడు తుంగతుర్తి నియోజకవర్గంలో ఉమ్మడి రాష్ట్రంలోని పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇలాంటి రోజులు వస్తాయనుకోలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



తడుల కోసం పైపులు తీసుకెళ్తున్న రైతు కాలురాం

### వచ్చిపోయే కరెంటుతో పారిన మడే పారుతున్నది

నాకున్న రెండెకరాల్లో వరి నాటు పెడితే.. నీళ్లు లేక ఎకరం ఎండింది. పశువుల మేతకు వదిలిపెట్టిన. బోరు ఆగిఆగి పోస్తున్నది. మిగిలిన ఎకరంలో కొద్దోగొప్పో పంట చేతికి వస్తుందని ఆశతో పైపులు వేసుకుని వరుస తడులు వేస్తున్నా చివరి మడికి నీరు చేరుతలేదు. కరెంట్ వచ్చి పోతుండే సరికి పారిన మడే పారుతున్నది. కేసీఆర్ గవర్నమెంట్‌లో కాల్వల్లో ఎప్పుడూ నీళ్లు ఉండేవి. చెరువులు, కుంటలు నిండి బోర్లు నిండుగా పోసేవి. ఇప్పటి ప్రభుత్వం కాల్వలకు సక్కగ నీళ్లు ఇవ్వకపోయేసరికి బోర్లు ఎండిపోయినయి. ఇప్పటికే 70 వేలకు పైగా పెట్టుబడి పెట్టిన. పెట్టుబడి కూడా వెళ్లదు.

-కాలురాం, రైతు, తిరుమలగిరి



పొలంలో పైపులతో తడులు తిప్పుతున్న రైతు దేవేందర్

### ప్రభుత్వం ఆదుకోవాలి

నేను మూడెకరాల్లో వరి, అరెకరంలో కూరగాయల తోట పెట్టిన. రెండున్నర ఎకరాల్లో వరితోపాటు కూరగాయల తోట కూడా ఎండింది. ఒక అరెకరంలో వచ్చి కొంత చేతికి వచ్చేట్లు ఉంటే పైపులు వేసి తడులు కడుతున్నా. నీళ్లు చాలడం లేదు. రెండు లక్షలకు పైగా పెట్టుబడి పెట్టిన. ప్రభుత్వం ఎండిన పంటలకు పరిహారం ఇచ్చి ఆదుకోవాలి.

-దేవేందర్, రైతు, తిరుమలగిరి



నాంపల్లి మండలం గానుగుపల్లిలోని రమేశ్ వ్యవసాయ క్షేత్రంలో దాచిన స్పిరిట్ డ్రమ్ములు, క్యాన్లు

## నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

- కనగల్, నాంపల్లి, చండూరుల్లో సోదాలు
- నాంపల్లి మండలం గానుగుపల్లిలో గుట్టుగా తయారీ
- భారీమొత్తంలో నకిలీ మద్యం పట్టివేత
- డ్రమ్ముల్లో స్పిరిట్, ఇతర ఫ్లేవర్స్ స్వాధీనం
- పోలీసుల అదుపులో నలుగురు నిందితులు
- ధూల్‌పేటలోనూ టాస్క్‌ఫోర్స్ పోలీసుల సోదాలు
- ఎస్ఓటీ, టాస్క్‌ఫోర్స్ బృందాల సంయుక్త ఆపరేషన్
- ఎస్పీ పవార్ పర్యవేక్షణలో కొనసాగుతున్న దర్యాప్తు

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : కొంతకాలంగా ప్రజల ప్రాణాలతో చెలగాటం పెడుతూ నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠా గుట్టురట్టైంది. అత్యంత విశ్వసనీయ సమాచారం మేరకు నల్లగొండ టాస్క్‌ఫోర్స్ పోలీసులతోపాటు ఎస్ఓటీ పోలీసులు సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌లో పెద్దఎత్తున నకిలీ మద్యం, తయారీకి ఉపయోగించే స్పిరిట్, ఫ్లేవర్స్, ఇతర సామగ్రి పట్టుబడింది. ఇప్పటికే తయారు చేసి విక్రయానికి సిద్ధంగా ఉన్న మద్యాన్ని సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం మొదలైన ఆపరేషన్ బుధవారం రాత్రి వరకు కొనసాగుతూనే ఉంది. దాంతో దీనిపై అధికారికంగా స్పందించేందుకు నల్లగొండ ఎస్పీ సహా ఎవరూ ముందుకు రాలేదు. దర్యాప్తు కొనసాగుతున్న క్రమంలో వివరాలు వెల్లడించలేమని పోలీసు వర్గాలు చెప్తున్నాయి.

చండూరుకు చెందిన పండ్ల వ్యాపారి ఎర్రజెల్ల రమేశ్ కొన్నేండ్లు పండ్లు, ఇతర పదార్థాలతో వైన్ తయారు చేసినట్లు సమాచారం. ఇందుకోసం నాంపల్లి మండలం గానుగుపల్లిలో తాను కొనుగోలు చేసిన వ్యవసాయ క్షేత్రాన్ని వినియోగిస్తున్నట్లు తెలిసింది. ఇదే క్రమంలో ఇతడికి చండూరుకు చెందిన ఓ మటన్ వ్యాపారి, వైన్స్‌లో పని చేసే ఓ వ్యక్తి తోడై నకిలీ మద్యం కూడా తయారు చేసి విక్రయించి సొమ్ము చేసుకోవాలని పథకం వేశారు. సదరు మటన్ వ్యాపారి గతంలో హైదరాబాద్ వైన్స్‌లో పని చేసిన సమయంలో నకిలీ మద్యం తయారీ కేసులో నిందితుడిగా తెలుస్తున్నది. ఇతడి సూచన మేరకు రమేశ్ గానుగుపల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో పండ్ల తోట ఉండగా దాని చుట్టూ ఫెన్సింగ్ వేసి, గేటు పెట్టి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాడు. ఇందులోనే పండ్ల చెట్ల మధ్యలో పెద్ద గొయ్యి తీసి అందులో ప్లాస్టిక్ డ్రమ్ములు ఉంచాడు. వాటిల్లో కొద్దిరోజులు కొంత చీప్‌లిక్కర్‌ను, దానికి స్పిరిట్‌ను, టేస్ట్ కోసం కావాల్సిన ఫ్లేవర్స్‌ను మిక్స్ చేసి నిల్వ చేస్తున్నట్లు తేలింది. తరువాత డ్రమ్ముల్లో నుంచి 20 లీటర్ల ప్లాస్టిక్ డబ్బాల్లోకి దీన్ని డంప్ చేసి విక్రయానికి సిద్ధం చేస్తున్నారు. దీన్ని ఖరీదైన మద్యం లేబుళ్లు కలిగిన ఖాళీ బాటిళ్లలోకి నింపి గట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్నట్లు తెలిసింది. దీన్ని నేరుగా వైన్స్‌షాపులకు కాకుండా సిట్టింగ్‌లు, బెల్ట్‌షాప్‌లు, ఫంక్షన్లల్లో మద్యం పార్టీలకు సేల్ చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో స్థానిక నేతలు తమ అనుచరులకు రెగ్యులర్‌గా మద్యం తాపేందుకు వీలుగా లూజ్ సేల్స్‌గానూ విక్రయిస్తున్నట్లు తెలిసింది. లూజ్‌సేల్స్‌గా విక్రయించిన మద్యం అక్కడక్కడ చెలామణిలోకి రావడంతో పోలీసుల దృష్టికి వచ్చింది. దాంతో ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ప్రత్యేకంగా టాస్క్‌ఫోర్స్ బృందాలను రంగంలోకి దించడంతో నకిలీ మద్యం తయారీ రాకెట్ గుట్టురట్టైంది. ఇందులో భాగంగానే మంగళవారం సాయంత్రం కనగల్ మండలం ఎడవెల్లికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో పోలీసులు సోదాలు చేశారు. ఇక్కడ నాలుగు క్యాన్లల్లో 80 లీటర్ల మద్యం దొరికినట్లు తెలిసింది. అతడు ఇచ్చిన సమాచారంతో చండూరులో రమేశ్ ఇంటిపై దాడులు చేయగా అక్కడ 60లీటర్ల లూజ్ మద్యం మూడు క్యాన్లల్లో బయటపడింది. రమేశ్‌ను అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టగా విస్తుపోయే విషయాలు వెలుగుచూశాయి. రమేశ్ తాను నకిలీ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న గానుగుపల్లిలోని వ్యవసాయ క్షేత్రాన్ని పోలీసులకు చూపించక తప్పలేదు. ఇక్కడ భారీ గోతి తీసి అందులో నాలుగు డ్రమ్ముల్లో నిల్వ ఉన్న స్పిరిట్‌తోపాటు 8 క్యాన్లల్లో నిల్వ చేసిన నకిలీ మద్యం, మద్యంలో టేస్ట్ కోసం ఉపయోగించే ఫ్లేవర్స్‌తోపాటు ఖాళీ క్యాన్లు, మద్యం బాటిల్స్‌ను కూడా పోలీసులు గుర్తించారు. ఈ వ్యవసాయ క్షేత్రాన్ని పోలీసులు తమ ఆధీనంలోకి తీసుకున్నారు. మధ్యాహ్నం తర్వాత నుంచి అటువైపు మీడియాతోపాటు ఇతరులెవరినీ రానివ్వలేదు. తర్వాత చండూరు మండలం గుండ్రపల్లి శివారులోని వ్యవసాయ భూమిలోనూ ఇదే తరహా నకిలీ మద్యం తయారీ వ్యవస్థ ఉన్నట్లు పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

### ధూల్‌పేటలోనూ సోదాలు

మద్యం, కల్లు విక్రయాలకు పేరున్న హైదరాబాద్ ధూల్‌పేటలోనూ టాస్క్‌ఫోర్స్ పోలీసులు సోదాలు చేశారు. చండూరుకు చెందిన రమేశ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా ధూల్‌పేటకు ప్రత్యేక బృందం వెళ్లినట్లు తెలిసింది. ఇక్కడి నుంచే నకిలీ మద్యం తయారీకి అవసరమైన స్పిరిట్‌తోపాటు ఫ్లేవర్స్, క్యాన్లు, ఖాళీ బాటిళ్లు సరఫరా అవుతున్నట్లు పోలీసులు విచారణలో గుర్తించారు. దాంతో నకిలీ మద్యం తయారీ రాకెట్‌తో సంబంధాలు ఉన్న ధూల్‌పేటకు చెందిన పలువురిని కూడా పోలీసులు ఆదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. వీరిందరినీ బుధవారం రాత్రి వరకు రహస్యంగా విచారిస్తూనే ఉన్నారు. దీనిపై మీడియాతో కథనాలు వెలువడ్డా అధికారికంగా స్పందించేందుకు పోలీసుల నిరాకరిస్తున్నారు. దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో ఇప్పుడే వివరాల వెల్లడించడమేని చెప్తున్నారు. ఈ మొత్తం కేసును ఎస్పీ శరత్ చంద్ర పవార్ పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో ఆయనే స్వయంగా ఇవ్వాలో, రేపో నకిలీ మద్యం రాకెట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించనున్నట్లు తెలిసింది.

## హెచ్‌సీయూ భూములపై ప్రభుత్వం మొండివైఖరి వీడాలి

- పచ్చని భూములను కొల్లగొట్టొద్దు
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భగ్గుమన్న విపక్షాలు, విద్యార్థి సంఘాలు
- రాస్తారోకోలు, ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనాలతో నిరసనలు



నల్లగొండలో హెచ్‌సీయూ భూముల వేలాన్ని ఆపివేయాలని సీపీఎం నిరసన

నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్2(నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూముల వేలాన్ని ఆపాలని, ప్రభుత్వ తీరుపై పోరుబాట పట్టిన విద్యార్థులు, విద్యార్థి సంఘం నేతలపై ప్రభుత్వ నిర్బంధకాండపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా విపక్ష పార్టీలు, విద్యార్థి, యువజన సంఘాలు బుధవారం రోడ్లెక్కాయి. యూనివర్సిటీ భూములతో ప్రభుత్వ ఆదాయం కోసం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయడం తగదంటూ.... హైదరాబాద్ పర్యావరణానికి పచ్చని వనంగా ఉన్న భూములను కొల్లగొట్టవద్దని ఆగ్రహం వ్యక్తం చేశాయి. ప్రభుత్వం మొండివైఖరి వీడి యూనివర్సిటీ భూములను వదిలేయాలని డిమాండ్ చేస్తూ పలు మండలాల్లో బుధవారం కూడా ఆందోళనలు కొనసాగాయి. గత రెండు రోజులుగా ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాలు సైతం మూడో రోజు కూడా అదేబాటులో పయనించారు. ఇప్పటికే దీనిపై బీఆర్‌ఎస్ యూనివర్సిటీ విద్యార్థుల పక్షాన గట్టిగా పోరాడుతున్న విషయం తెలిసిందే. దీంతో జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నేతలతోపాటు బీఆర్‌ఎస్‌వీ నేతలు సైతం తమ ఆందోళనలను ఉధృతం చేస్తున్నారు. ఎంజీ యూనివర్సిటీతోపాటు పలుచోట్ల బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు జరిగాయి. ఇక ఏబీవీపీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ యూనివర్సిటీలో తరగతుల బహిష్కరణ చేసి ఆందోళనకు దిగారు. సీపీఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు చాలా చోట్ల రాస్తారోకోలు, నల్లబ్యాడ్జీలతో రోడ్లపై బైఠాయింపులు జరిగాయి. నల్లగొండలో ప్రభుత్వ తీరును నిరసిస్తూ బస్టాండ్ సమీపంలోని సుభాశ్ విగ్రహం వద్ద నల్లజెండాలు, బ్యాడ్జీలు ధరించి రాస్తారోకో చేశారు. భూదాన్ పోచంపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. మోతె మండల కేంద్రంలో ఖమ్మం-సూర్యాపేట హైవేపై సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తక్షణమే ప్రభుత్వం భూముల వేలాన్ని నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మేళ్లచెర్వు, ఆత్మకూర్(ఎస్)లోనూ సీపీఎం శ్రేణులు రాస్తారోకోలు చేపట్టారు. ఇక సూర్యాపేట జిల్లా కేంద్రంలో సీపీఎం నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హెచ్‌సీయూ భూముల వేలంపై ఆందోళనకు దిగాయి. ప్రధాన రహదారిపై బైఠాయించి రాకపోకలను అడ్డుకుంటూ ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. కోదాడ పట్టణంలోనూ సీపీఎం శ్రేణులు రాస్తారోకో చేపట్టి ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. భువనగిరిలో హెచ్‌సీయూ భూముల పట్ల ప్రభుత్వ తీరును నిరసిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు.



మోతెలో సీపీఎం ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్

## ప్రభుత్వానికి రైతులపై చిత్తశుద్ధి కరువు

- హామీలు అమలు చేయకుండా మోసం
- మాజీ ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్

గుర్రంపోడ్, ఏప్రిల్ 2 : రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు, ప్రజలపై చిత్తశుద్ధి లేదని నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే నోముల భగత్ కుమార్ అన్నారు. గుర్రంపోడ్ మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీల హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. పూర్తి స్థాయిలో రైతు రుణమాఫీ, రైతు భరోసా చేయకుండా అన్నదాతను నట్టేట ముంచిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ మోసపూరిత పాలనను ప్రజలు గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఇటీవల జరిగిన హుజూర్‌నగర్ మీటింగ్‌లో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి బీఆర్‌ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెప్తామని హెచ్చరించారని, తాటాకు చప్పుళ్లకు ఏ బీఆర్‌ఎస్ కార్యకర్త భయపడడని తెలిపారు. అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని, ప్రభుత్వాలు మారుతాయని చెప్పారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో మండలానికి ఇచ్చిన ఇండ్ల స్థలాలను కొర్రీలు పెట్టకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇవ్వాలని అన్నారు.

సమావేశంలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నాగులవంచ తిరుపతిరావు, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పామనగుండ్ల వెంకన్న, మాజీ ఎంపీపీ శ్యామల బొజ్జయ్య, నాయకులు నాగులవంచ నాగేశ్వర్‌రావు, కామళ్ల రాములు, మేకల వెంకట్‌రెడ్డి, షేక్ సిరాజ్, కూనూరు సైదిరెడ్డి, కంచాని చంటి, సంకటి గిరి, ఇనుపాముల రామారావు, మల్లోజు శ్రీనివాసాచారి, కొండ్రపల్లి గిరి, ఏలుకొండ నగేశ్, కూర బాల్‌రాజ్, వనమాల మహేందర్, మేడి లింగయ్య, షేక్ ఖాసీం, వాకిటి చంద్రయ్య, జాల మల్లేశం, పర్శనబోయిన వెంకన్న, షేక్ మోయిన్, మోగావత్ భాస్కర్, చిరంజీవి పాల్గొన్నారు.



చివ్వేంల మండలం గుంపుల గ్రామంలో మట్టి తింటూ నిరసన వ్యకం చేస్తున్న దివ్యాంగులు

## దివ్యాంగులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

చివ్వేంల, ఏప్రిల్ 2 : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం సూర్యాపేట జిల్లా చివ్వేంల మండలం గుంపుల గ్రామంలో దివ్యాంగులు వినూత్న రీతిలో మట్టి తింటూ నిరసన వ్యక్తం చేశారు. మంత్రి వర్గ విస్తరణలో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ మాట్లాడుతూ అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ దివ్యాంగుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో వికలాంగుల బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, అట్రాసిటీ చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. వికలాంగుల సంక్షేమానికి రూ. 3 వేల కోట్లతో ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్యబాబు, జిల్లా అధ్యక్షుడు గోగుల శేఖర్ రెడ్డి, నాయకులు పోతురాజు సుధీర్, మున్న మధు యాదవ్, నరేందర్, చంద్రయ్య, సుక్కయ్య, వినోద్ కుమార్, చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.



నల్లగొండలో విద్యార్థుల కేరింతలు

## ముగిసిన పది పరీక్షలు

### వీడ్కోలు చెప్పుకున్న విద్యార్థులు

రామగిరి/సూర్యాపేట అర్బన్, ఏప్రిల్ 2 : పదో తరగతి వార్షిక పరీక్షలు బుధవారంతో ముగిశాయి. ఈ నెల 21న ప్రారంభమైన పరీక్షలు సాంఘిక శాస్త్రం పరీక్షతో పూర్తయ్యాయి. ఏడాది అంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులు సంతోషంగా గంతులేశారు. పరీక్ష కేంద్రాల వద్ద తోటి విద్యార్థులకు వీడ్కోలు చెప్పుకున్నారు. ఫొటోలు, సెల్ఫీలు దిగారు. సంక్షేమ హాస్టళ్లలో ఉండే విద్యార్థులు ఇంటి బాట పట్టారు. తల్లిదండ్రులు, విద్యార్థులతో బస్టాండ్‌లు కిటికిటలాడాయి.

## ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థుల గల్లంతు

- ఒకరి మృతదేహం లభ్యం..
- మరొకరి కోసం గాలింపు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 2 : మండలంలో బుధవారం ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు గల్లంతవగా అందులో ఒకరి మృతదేహం లభ్యమైంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని దేశ్‌ముఖి గ్రామం విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న నలుగురు విద్యార్థులు గంధ జతిన్(18), బొడ్డు శ్యామ్ చరణ్ (18), వర్గల శ్రీమాన్, భరత్.. కళాశాల సమీపంలోని ఓ క్వారీలో బుధవారం సాయంత్రం ఈతకు వెళ్లారు. అందులో జతిన్, శ్యామ్ చరణ్ క్వారీలో దిగగా మిగతా ఇద్దరూ ఒడ్డుకే ఉన్నారు. నీటిలోకి దిగిన ఇద్దరూ ఈత రాక మునిగిపోతుండడంతో వెంటనే ఇతర స్నేహితులకు సమాచారం అందించారు. వారు పోలీసులకు సమాచారం అందించడంతో గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి 9 గంటలకు చరణ్ మృతదేహం లభించింది. జతిన్ కోసం గాలిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్ రెడ్డి తెలిపారు.